అంగన్‌వాడీల ఆందోళనకు ఎమ్మెల్యే మద్దతు

రాయచూరు, జూన్ 20: ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ వ్యతిరేకించారు. ఈ విషయంపై అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళనకు తాము పూర్తిగా సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు. గురువారం నగరంలోని టిప్పుసుల్తాన్ గార్డెన్‌లో చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్యే వారి పోరాటానికి అండగా ఉంటానన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని అంగన్‌వాడీలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సైకిల్ జాతాలో బీజేపీ నాయకులు

కొనసాగుతున్న పెట్రో మంటలు



బెంగళూరు, జూన్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ బీజేపీ చేపట్టిన నిరసనలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. మల్లేశ్వరంలోని పార్టీ కార్యాలయం నుంచి విధానసౌధ దాకా సైకిల్‌పై ర్యాలీగా బయల్దేరారు. పార్టీ కార్యాలయం వద్ద విజయేంద్ర మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు భారం కలిగించే పెట్రోల్, డీజిల్ ధరల పెంపును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ధరలు తగ్గించేదాకా పోరాటం కొనసాగుతుందన్నారు. విజయేంద్ర, బీజేపీ సీనియర్ నేతలు అశ్వత్థనారాయణ, సీటీ రవి, చలవాదినారాయణస్వామి సహా పలువురు పెట్రోల్ ధరలు తగ్గించాలని నినాదాలు చేస్తూ సైకిల్ జాతాలో పాల్గొన్నారు. విధానసౌధకు రాక ముందే పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. బెంగళూరు నగర, ఉత్తర, దక్షిణ జిల్లాల కార్యకర్తలు నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.





బీజేపీ నేతలను అరెస్ట్ చేసి తరలిస్తున్న పోలీసులు



ప్రతిపక్షానికి సీనియర్ల కరువు

- ముగ్గురు మాజీ సీఎంలు లోక్‌సభలో ప్రవేశం
- అదే దారిలోనే పలువురు మాజీ మంత్రులు
- బలమైన వాదన వినిపించేవారేరీ..?

బెంగళూరు, జూన్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం ఏదైనా ప్రతిపక్షం మాత్రం శక్తివంతంగా ఉండడమనేది రెండుదశాబ్దాల కాలంగా సాగుతోంది. దీనికి అనుగుణంగా అపార అనుభవం కలిగిన నేతలు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలలో ఉండేవారు. శాసనసభలో ప్రతిపక్షంలో ఉండేవారు నిలదీసే ప్రశ్నలకు అధికార పక్ష సభ్యులు, మంత్రులు సైతం బెంబేలెత్తేవారు. ఈ విధానం ప్రతి శాసనసభ సమావేశాల్లోనూ కొనసాగింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు, బడ్జెట్‌తో పాటు ప్రత్యేక నిబంధనలతో వివిధ అంశాలపై చర్చల కోసమే ప్రతిపక్షంలో ఉండే సీనియర్‌నేతలు పోటీపడేవారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు అధికార పార్టీలో ఉండేవారి కంటే ప్రతిపక్ష సభ్యులే అధికంగా ఉండటంతో పాటు గంటల తరబడి ప్రస్తావించేవారు. ఇలా రోజుల తరబడి సభ వాడిగావేడిగా సాగుతుండేది. ఇదంతా కొంతకాలం కిందటి నాటి పరిస్థితి. అయితే ప్రస్తుతం శాసనసభలో సీనియర్లకు కొరత ఏర్పడింది. దీంతో వచ్చే శాసనసభ సమావేశాలు ఏవిధంగా సాగుతాయి ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, జేడీఎస్ సభ్యులు అధికార పార్టీ మంత్రులను ఏవిధంగా కట్టడి చేస్తారనేది ఆసక్తిగా మారింది. 2019 శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ లేక పోవడంతో జేడీఎస్‌తో కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ప్రతిపక్ష బీజేపీలో యడియూరప్ప, బసవరాజ్‌బొమ్మై, జగదీష్‌శెట్టర్, గోవిందకారజోళ వంటి అగ్రనేతలు ప్రతి అంశంలోను మైత్రి ప్రభుత్వంలోని మంత్రులను నిలదీసేవారు. శాసనసభలో నిరసనలకు దిగితే ఏకంగా రెండుమూడు రోజులు సభలోనే రాత్రి పగలు తేడా లేకుండా గడిపేవారు. ఆతర్వాత మారిన రాజకీయ సమీకరణలతో బీజేపీ అధికారంలోకి రాగా కాంగ్రెస్ నుంచి సిద్దరామయ్య, డీకే శివకుమార్, కృష్ణభైరేగౌడతో పాటు పలువురు నేతలు ప్రతి అంశాలపై దీటుగా స్పందించేవారు. ఇటీవల ఏడాది కిందట జరిగిన శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు ఏకంగా 135 మంది ఎమ్మెల్యేల మద్దతు లభించింది. బీజేపీకి చెందిన సీనియర్ నేత, దాదాపు మూడు దశాబ్దాలుగా అధికారం లేదా ప్రతిపక్షంలో కనిపించిన యడియూరప్ప ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. దీంతో సభ కొంత మేరన బోసిపోయినట్లు అయ్యింది. అదే పెద్ద అఘాతంగా బీజేపీకి ఇటీవల లోక్‌సభ ఎన్నికలు మరింత మందిని సీనియర్‌లను దూరం చేసింది. దశాబ్దాల కాలంగా రాష్ట్ర రాజకీయాలపై పరిమితంగా ఉంటూ దశాబ్దాల కాలంగా సభలో ఉంటూ వచ్చిన బసవరాజ్ బొమ్మై శిగ్గావి ఎమ్మెల్యేగా ఉన్నా హావేరి నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఏడాది కిందట శాసనసభ ఎన్నికలలో ఓడిన మాజీ సీఎం జగదీశ్‌శెట్టర్ పరిషత్ సభ్యుడిగా కొనసాగుతున్నా ఆయన బెళగావి నుంచి పోటీ చేసి గెలుపు సాధించారు. విజయపుర జిల్లా నుంచి ఎమ్మెల్యేగా కొనసాగి డీసీఎంగాను వ్యవహరించిన గోవిందకారజోళ చిత్రదుర్గ నుంచి ఎంపీ అయ్యారు. ఇక బీజేపీతో మైత్రి ఏర్పాటు చేసుకున్న మాజీ సీఎం కుమారస్వామి చెన్నపట్టణ ఎమ్మెల్యేగా ఉంటున్నా మండ్య లోక్‌సభ సభ్యుడిగా గెలుపు సాధించారు. కుమారస్వామి సభలో మాట్లాడితే అధికార పక్ష సభ్యులకు వణుకు పుట్టేది అని నానుడి. ఆయన ఏ అంశమైనా పక్కా ఆధారాలతో మాట్లాడేవారు. చివరకు కుమారస్వామి ప్రశ్నలకు ముఖ్యమంత్రులు కూడా సమాధానాలు చెప్పలేని సందర్భాలూ ఉన్నాయని అంటారు. కుమారస్వామి కేంద్ర కేబినెట్‌లో ఉక్కు, భారీ పరిశ్రమల శాఖా మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఇలా ప్రముఖ నేతలంతా శాసనసభకు దూరం కావడంతో ప్రస్తుతం ప్రతిపక్ష నేత అశోక్, సునిల్‌కుమార్, అరవిందకుమార్ బెల్లద్, బసనగౌడ పాటిల్ యత్నాళ్ వంటి వారే కీలకులయ్యారు. యత్నాళ్ ఒక్కరే ప్రస్తుతం బీజేపీలో డేరింగ్ డాషింగ్ నాయకుడిగా రాణిస్తున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి. త్వరలోనే శాసనసభ సమావేశాలు జరపనున్నారు. ప్రతిపక్షనేతలు ఏవిధంగా వ్యవహరిస్తారో వేచిచూడాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.







జగదీష్ శెట్టర్ ←



గోవింద కారజోళ →



కేజీఎఫ్ గనుల తవ్వకాలకు గ్రీన్ సిగ్నల్

- విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రూ.297 కోట్లు
- దర్శన్ కేసుపై నోరు తెరవద్దు
- కేబినెట్ భేటీలో సీఎం

బెంగళూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కోలారు గోల్డ్‌ఫీల్డ్ (కేజీఎఫ్) ప్రదేశంలో గనుల తవ్వకాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. గురువారం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన కేబినెట్ భేటీ జరిగింది. మంత్రివర్గ తీర్మానాలను శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు తెలిపారు. వాణిజ్య పరిశ్రమలశాఖకు సంబంధించి గనుల కాంట్రాక్టు గడువు ముగిసినందున కేజీఎఫ్ ప్రాంతంలో కేంద్రంనుంచి గనుల కార్యకలాపాలను చేపట్టేందుకు అనుమతి ఇచ్చామన్నారు. 1304 ఎకరాలలో గనుల కాంట్రాక్టును కొనసాగించేందుకు కేంద్రం ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించిందన్నారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి 297.77 కోట్ల రూపాయల విడుదలకు కేబినెట్ ఆమోదించింది. విద్యాశాఖ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, డిగ్రీ కళాశాలలకు ఉచితంగా విద్యుత్ అందించేలా నిర్ణయించారు. ఇందుకు 29.15 కోట్ల రూపాయలు అంచనా కాగా 46,829 పాఠశాలలు, 1434 డిగ్రీ కళాశాలలకు ఉచిత నీరు, విద్యుత్ సమకూర్చదలిచామన్నారు. కోటి రూపాయలతో క్రైస్ వసతి పాఠశాలల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం కార్యక్రమానికి అనుమతులు ఇచ్చారు. రోటరీ సంస్థ పర్యవేక్షించనుందన్నారు. నగరాభివృద్ధిశాఖ పరిధిలో బెళగావి పరిధిలో లేఅవుట్ నిర్మాణానికి రూ.137 కోట్లు చెల్లించేలా కేబినెట్ ఆమోదించిందన్నారు. కేబినెట్‌లో 7వ వేతన కమిషన్ సిఫారసు గురించి తీవ్రమైన చర్చ జరిగింది. కమిషన్ సిఫారసులను జారీ చేసే అధికారాన్ని ముఖ్యమంత్రిదే తుది నిర్ణయంగా మంత్రివర్గం స్పష్టం చేసింది. కమిషన్ సిఫారసు చేసిన విధంగా 25శాతం వేతనాలు పెంచేందుకు కేబినెట్ సలహా ఇచ్చింది. అయితే 27శాతం పెంచేలా సీఎం ఆసక్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. ఏడో వేతన కమిషన్ సిఫారసు చేస్తే 13.5 లక్షలమంది ఉద్యోగులకు అనుకూలం కానుంది. 6లక్షలమంది ప్రభుత్వ ఉద్యోగులు, బోర్డులు, కార్పొరేషన్‌లలో 3లక్షలమందితోపాటు 4.5 లక్షలమంది రిటైర్డు ఉద్యోగులకు వేతన కమిషన్ వర్తించనుంది.

దర్శన్ కేసుపై నోరు తెరవద్దు

ఇంతటి ఘోరమైన దారుణాన్ని నేనెప్పుడు చూడలేదని చిత్రదుర్గ రేణకాస్వామి హత్య విషయమై సీఎం సిద్దరామయ్య సంచలన వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ఘోరమైన హత్యను తానెప్పుడూ చూడలేదని సీఎం విచారం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నటుడు దర్శన్‌తోపాటు ఇతర నిందితుల సమాచారం రోజూ బయటకు వచ్చే అంశాలు దారుణంగా ఉన్నాయన్నారు. ఈ కేసుకు సంబంధించి మంత్రులు, ఎమ్మెల్యేలు నోరు జారవద్దని అనుకూలం, వ్యతిరేకం అని వ్యాఖ్యానించవద్దని సూచించినట్లు తెలుస్తోంది. సీఎం ఆదేశంతో ఈ అంశాన్ని ప్రస్తావించలేదని తెలుస్తోంది.



లేడీ..!

- ఫోన్ కాల్స్‌తో మహిళకు వేధింపులు
- మెజిస్టిక్ టాయ్‌లెట్‌లో ఆ ఉద్యోగి ఫోన్ నంబరు
- పోలీసులకు ఫిర్యాదు.. కోర్టుకు చేరిన కేసు


బెంగళూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): అనుచిత ఫోన్ కాల్స్‌తో విసిగిపోయిన ఓ మహిళ తాళలేక పోలీసులకు ఫిర్యాదు చేసింది. రైల్వే స్టేషన్లు, బస్టాండ్ టాయ్‌లెట్లలో మొబైల్ నెంబర్ రాసి అమ్మాయిలు కావాలా.. సంప్రదించండి అనే రాతలు తరచూ చూస్తుంటాం. ఈ పిచ్చి రాతలే ఓ వ్యక్తి మెడకు చుట్టుకుని కోర్టుదాకా వెళ్లేలా చేశాయి. బెంగళూరు మెజస్టిక్‌లోని ఓ టాయ్‌లెట్‌లో ఓ మహిళ నెంబరు రాసి కాల్‌గర్ల్ కావాల...అంటూ పేర్కొన్నారు. ఆ తర్వాత ఆ మహిళకు నిరంతరం ఫోన్‌కాల్స్ వచ్చేవి. నీ రేటెంత అంటూ అనుచితంగా మాట్లాడేకాల్స్ వస్తుండడంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. అల్లాబక్ష్‌పాటిల్ అనే వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. దీంతో సదరు వ్యక్తి హైకోర్టును ఆశ్రయించి కేసును రద్దు చేయాలని కోరారు. అయితే కోర్టు సదరు పిటీషన్‌ను తిరస్కరించారు. చిత్రదుర్గలో పని చేస్తున్న ఓ ఉద్యోగి ఇటీవల ఆమెపై అధికారి కోరిన మేరకు ఫోన్ నెంబర్ ఇచ్చారు. ఇది జరిగిన కొన్ని రోజులకే ఆమెకు నిరంతరంగా ఫోన్‌కాల్స్ వచ్చేవి. దీంతో విసుగు చెందారు. ఫోన్ చేసిన కొందరికి ఈ నెంబరు మీకెలా వచ్చిందని ప్రశ్నించగా అల్లాబక్ష్‌పాటిల్ ఇచ్చారని, మెజిస్టిక్ టాయ్‌లెట్‌లో రాశారని మరికొందరు బదులిచ్చారు. ఈమేరకు ఆమె అల్లాబక్ష్‌పై ఫిర్యాదు చేశారు. మహిళను మానసికంగా వేధించడం ఇబ్బంది కలిగించే అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని కోర్టు తెలిపింది. మహిళల ఫొటోలు, వీడియోలు బహిరంగం చేయడంతో ఆమె వ్యక్తిగతానికి భంగం కలుగుతుందని ఇటువంటి సంఘటనలపై సమగ్ర తనిఖీలు జరపాలని హైకోర్టు ధర్మాసనం బుధవారం పోలీసులను ఆదేశించింది. పిటీషన్‌ను రద్దు చేయలేమని కేసును ఎదుర్కొనాలని అల్లాబక్ష్‌కు కోర్టు సూచించింది.

కన్నడకు ప్రాధాన్యం పెరగాలి : సీఎం



భువనేశ్వరీ మాత విగ్రహ ఏర్పాటుకు భూమి పూజచేస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకేశీ తదితరులు

బెంగళూరు, జూన్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కన్నడకు ప్రాధాన్యం పెరగాలని, సర్వత్రా కన్నడ వాతావరణం కల్పించడం అత్యంత అవసరంగా ఉందని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. కన్నడ భాష, నేల, నీరు సంరక్షణ ప్రతి కన్నడిగుడి బాధ్యత కావాలని పిలుపునిచ్చారు. విధానసౌధ ప్రాంగణంలో కన్నడ మాత భువనేశ్వరీదేవి కాంస్య విగ్రహ ఏర్పాటుకు సీఎం గురువారం భూమి పూజ చేశారు. డీసీఎం డీకే శివకుమార్, పరిషత్ సభాపతి బసవరాజ్‌హొరట్టి, కన్నడ సాంస్కృతిక శాఖా మంత్రి శివరాజ్‌తంగడగితో పాటు పలువురు ముఖ్యులు భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ కర్ణాటకలో నివసించేవారంతా కన్నడలోనే మాట్లాడుతానని ప్రతిన బూనాలన్నారు. కన్నడిగులు ఉదారవాదులని ఇతర భాషలు మాట్లాడేవారిని ఎంతగానో అభిమానిస్తారన్నారు. అందుకే వారు సొంత భాషలలోనే మాట్లాడుకుంటారన్నారు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లకు వెళితే వారి భాషలు మినహా ఇతర భాషలు మాట్లాడరన్నారు. మనం కూడా కన్నడలోనే మాట్లాడాలన్నారు. కర్ణాటకలో నివసించేవారంతా కన్నడలోనే మాట్లాడాలని సూచించారు. కన్నడ నేర్చుకోవాలని, ఇతర రాష్ట్రాల వాసుల తరహాలో మేం వ్యవహరించమన్నారు. కానీ మన భాష, నేలనీరు విషయంలో రాజీ పడేది లేదన్నారు. భువనేశ్వరీ దేవి ఆశీస్సులు అందరిపైనా ఉండాలన్నారు. నవంబరు 1న జరిగే కన్నడ రాజ్యోత్సవం నాటికి విగ్రహ పనులు పూర్తికావాలని సంబంధిత అధికారులను సీఎం ఆదేశించారు.




ఉపరాష్ట్రపతితో కేంద్ర మంత్రి కుమార

ఉప రాష్ట్రపతితో కేంద్రమంత్రి భేటీ

బెంగళూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి గురువారం ఢిల్లీలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్‌తో భేటీ అయ్యారు. ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో ఇరువురూ సుదీర్ఘ సమయం గడిపారు. కర్ణాటకకు సంబంధించిన అంశాలతోపాటు భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖకు సంబంధించి చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఢిల్లీలో ఉన్న కేంద్రమంత్రి కుమారస్వామి రాష్ట్రానికి సంబంధించి పలువురు కేంద్ర మంత్రులను భేటీ అవుతున్నారు. రైల్వే మంత్ర, హోంశాఖ మంత్రి అమిత్‌షాను భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించి రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు.

పరిషత్‌లో ప్రతిపక్ష హోదా కోసం పోటీ

బెంగళూరు, జూన్ 20(ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లో ప్రతిపక్షనేత హోదా కోసం బీజేపీలో పోటీ పెరుగుతోంది. ఏడాది కాలంగా పరిషత్‌లో ప్రతిపక్ష నేతగా కొనసాగిన కోటా శ్రీనివాసపూజారి ఉడుపి-చిక్కమగళూరు లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైన విషయం తెలిసిందే. దీంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఖాళీ అయిన ప్రతిపక్షనేత హోదా స్థానం పొందేందుకు పార్టీ ప్రధాన కార్యదర్శి రవికుమార్, సీనియర్‌నేత సీటీ రవి, చలవాది నారాయణస్వామి ఎవరికి వారు జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. చలవాది నారాయణస్వామికి శాసనసభ ప్రతిపక్ష నేత అశోక్ మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి వలస వచ్చిన వారికి కీలక హోదా కల్పించేందుకు అగ్రనేతలు సుముఖత వ్యక్తం చేస్తారా అనేది చర్చకు దారితీస్తోంది. ఇక రాష్ట్ర పార్టీలోనే కాకుండా జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొంతకాలం వ్యవహరించిన సీటీ రవి ఢిల్లీ పెద్దల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తోంది. రవికుమార్ పట్ల పార్టీ అధ్యక్షులు విజయేంద్ర సహకారం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్ష నేతను వర్షాకాలం సమావేశాల నాటికి ఖరారు చేయదలచారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.65	1,579.76
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	759	451
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,796	1553
సామర్థ్యం (టీఎంసీలు)	5.79	4.35

నిధులివ్వకుండా కేంద్రం వేధిస్తోంది

- గ్యారెంటీ పథకాలకు రూ.60 వేల కోట్లు అవసరం
- బస్సు చార్జీలు పెంచే ఆలోచన లేదు
- ఇంధన ధరలు మన్మోహన్ హయాంలోనే తక్కువ
- దేవదారి మైనింగ్ లీజ్ కుమారస్వామికే తెలుసు
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య



జిందాల్ విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

బళ్లారి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కర్ణాటక రాష్ట్రానికి ఇస్తామన్న నిధులు ఇవ్వకుండా వేధిస్తోందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆరోపించారు. బెంగళూరు సిటీ డెవలప్‌మెంట్‌కు రూ.4వేల కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారని, కాని ఆ నిధులు ఇవ్వకుండా మొండిచేయి చూపారన్నారు. రైతులకు నష్టపరిహారం కింద కూడా కేంద్రం నిధులు ఇవ్వలేదని సీఎం అన్నారు. జిందాల్ విమానాశ్రయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు సక్రమంగా అమలు చేయాలంటే రూ. 60వేల కోట్లు అవసరమని చెప్పారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజల్ ధరల పెంపును గమనిస్తే గత కాంగ్రెస్ కాలంలో ఎంత ఉందో, ఇప్పుడు ఎంత పెంచిందో తెలుస్తుందన్నారు. బస్సు చార్జీలు పెంపు ఆలోచన లేదన్నారు. బీజేపీకి దమ్ముంటే కర్ణాటకలో గ్యారెంటీలను రద్దు చేయమని చెప్పాలని సవాల్ విసిరారు. మన్‌మోహన్ ప్రధానిగా ఉన్న కాలంలో ఒక బ్యారల్ డీజల్, పెట్రోల్ ఎంత ఉండేదో, మోదీ ప్రధాని మంత్రి అయ్యాక డీజల్, పెట్రోల్ ధర ఎంత పెరిగిందో పోల్చిచూడాలన్నారు.

దేవదారి మైనింగ్ లీజ్‌పై విలేకరులు ప్రశ్నలు సంధించగా, ఆ విషయం కుమారస్వామి ముఖ్యమంత్రి కాలంలో జరిగిందని, ఈ విషయం గురించి ఆయన్నే అడగాలని విలేకరులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు విషయంలో బీజేపీ మంత్రులు కేంద్రంలో ఉన్నా మాట్లాడడంలేదని తప్పుపట్టారు. సీఎం వెంట మంత్రి సంతోష్ లాడ్, జమీర్ అహ్మద్, మాజీ మంత్రి బి. నాగేంద్ర, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, డీ.సీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, ముండ్రిగి నాగరాజు, విజయనగర ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప, తదితర కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

స్థానికులకు కర్మాగారాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



ఈసీపీఎల్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న కరవే

కంప్లి, జూన్ 20 : కుడితిని వద్ద వున్న బీసీపీఎల్ కర్మాగారంలో స్థానికులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని రక్షణ వేదిక పదాధికారులు నరసింహరాజు, సంపత్ కుమార్, తిమ్మప్ప, జంగ్లిసాబ్, భావి శివకుమార్ విజ్ఞప్తి చేశారు. కేపీసీఎల్ ఎదురుగా వున్న ఈసీపీఎల్ వద్ద, సుల్తాన్‌పురం వద్ద వున్న ఈసీపీఎల్ డాంబర్ ఫ్యాక్టరీ వద్ద రక్షణ వేదిక పదాధికారులు, సంఘ సంస్థ నేతలు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ ఈ డాంబర్ ఫ్యాక్టరీ దుమ్ము ధూళి వల్ల సుల్తాన్‌పురం తోరణగల్లు, అరిగిణదోణి, జానెకుంటి, కుడితిని, వేణి వీరాపురం, సిద్దమ్మనహళ్లి, ఏళుబెంచి, దరోజీ చుట్టుపక్కల గ్రామాలలోని వారు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. రోగాలు మాత్రం మాకు కల్పిస్తూ ఉద్యోగాలు మాత్రం ఇతర రాష్ట్రాల వారికి కల్పించడం ఎంతవరకు సమంజసమన్నారు. అనంతరం నిరసనను దృష్టిలో వుంచుకుని ఈసీపీఎల్ అసిస్టెంట్ మేనేజర్ మేఘరాజ్ అక్కడకు చేరుకుని వారి సమస్యలను పై అధికారులకు తెలియజేస్తామన్నారు. వారితో పాటు వీరేష్, రవి కుమార్, ఇంద్ర, పురుషోత్తమ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



అవగాహన జాతాలో యోగాభ్యాసకులు

బళ్లారి సిటీ, జూన్ 20: 'యోగాభ్యాసంతో ఆరోగ్యవంతులుగా మారండి' అనే నినాదంతో ప్రారంభమైన ప్రపంచ యోగాదినోత్సవంపై అవగాహన కోసం ఆయుష్ శాఖ, పతంజలి యోగాసమితి సహకారంతో హొసపేటలో గురువారం జాతా నిర్వహించింది. హొసపేటలో ప్రజాపితా బ్రహ్మకుమారి యూనివర్సిటీ, హొసపేట చాంబర్ ఆఫ్ కామర్స్ తదితర సంస్థల సహకారంతో బైక్ జాతా నిర్వహించారు. ఈ జాతా జంబునాథ్‌రోడ్డు, బళ్లారి సర్కిల్, వడకరాయ దేవాలయం పక్కన మెయిన్ బజార్, వీరమదకరి సర్కిల్, వాల్మీకి సర్కిల్, మార్కండేయ సర్కిల్, వంద బెడ్ల ఆస్పత్రిరోడ్డు, పునీత్ రాజ్‌కుమార్ సర్కిల్ మీదుగా ఫ్రీడం పార్క్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఆయుష్ విభాగం డాక్టర్ గురుబసవరాజు ప్రసంగిస్తూ, మన శారీరక, మానసిక సమతుల్యతతో పాటు ఆరోగ్యాన్ని అందించేందుకు యోగా మంచి సాధనమని అన్నారు. పతంజలి యోగా సమితి విజయ నగరం జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ హళ్ళికేరి మాట్లాడుతూ యోగా సామాన్యమైనదని, ఆర్థిక బారం లేనిదని, యోగా ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో హొస్పేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలు అశ్విని కోతంబరి, ప్రజాపితా బ్రహ్మకుమారి యూనివర్సిటీ మానస అక్క,రేవతి అక్క, భూపాల్ ప్రహ్లాద్, పతంజలి రాష్ట్రకమిటీ సభ్యులు కిరణ్‌కుమార్, రాజేశకర్, అనంతజోషి, శ్రీరామ్, బోడ రామన్న, డాక్టర్ మునివాసదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్ కార్యాలయంలో ఆరోగ్య శిబిరం



ఆరోగ్య శిబిరంలో మీనళ్ళి తాయణ్ణ,వైద్యసిబ్బంది

బళ్లారి సిటీ, జూన్ 20: నగరంలోని జేడీఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం గుండెజబ్బులు, కంటి, ఎముకల కీళ్ళ సమస్యలు, నరాలవ్యాధి సమస్యలు, కిడ్నీలో రాళ్ళు, క్యాన్సర్, తదితర సమస్యలపె ఆరోగ్య పరీక్ష శిబిరం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ మాట్లాడుతూ గ్రామీణ విధాన సభ నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయితీలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పృధ్వీ, డా.రోహిత్, డా.జయంత్, డా.యశ్వంత్, అర్చన, యూనిట్ అధ్యక్షుడు వంద్రి, బళ్లారి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్, రామాంజినీ, బసప్ప, చరకుంట ఈరన్న, సిద్దు, భవాని, వరలక్ష్మి, జమీలా బేగం, యశోద, నీల, రేణుక, నాగవేణి పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల చుట్టూ నిషేధాజ్ఞలు

బళ్లారి సిటీ, జూన్ 20: డీసీఈటీ (డిప్లొమా సీఈటీ) ప్రవేశ పరీక్షలు నగరంలోని రెండు కేంద్రాలలో ఈ నెల 22న మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని, కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రాల చుట్టు ప్రక్కల 200 మీటర్లలోపు జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లు మూసివేయాలని అనధికార వ్యక్తులు గుంపులు గుంపులు సంచరించరాదని ప్రకటించారు. డిప్లొమా ప్రవేశ పరీక్షను పర్యవేక్షిస్తున్న సిబ్బందికి ఈ ఉత్తర్వులు వర్తించవన్నారు.

రక్తదానంతో మరో ప్రాణాన్ని కాపాడండి

కంప్లి, జూన్ 20: రక్తదానం చేసి ఆపదలో వున్న వారినికాపాడాలని ఏసీసీ అదానీ గ్రూపు హెచ్‌ఆర్ రవి చంద్ర పటేల్ తెలిపారు. కుడితిని వద్ద వున్న ఏసీసీ కర్మాగారంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 76 మందికి పైగా రక్తదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలకొకసారి 40 సంవత్సరాల వరకు రక్తదానం చేయవచ్చునన్నారు. దీని వల్ల గుండెజబ్బు, మానసిక ఒత్తిళ్లు తొలగి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, అబ్దుల్ షేక్, బ్లడ్ బ్యాంకు డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సర్టిఫికెట్లు కూడా అందించారు.

కంప్లిని ఆదర్శ ప్రాంతంగా మారుద్దాం

కంప్లి, జూన్ 20 : కంప్లి నియోజకవర్గాన్ని ఆదర్శ ప్రాంతంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ అన్నారు. దేవసముద్రం వద్ద పైపులైన్ పనులకు గురువారం ఆయన భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటికి రూ. 2.39 కోట్లు మంజూరయ్యాయని, దీని ద్వారా దేవసముద్రం, నెంబర్ 10 ముద్దాపురం, మెట్రి గ్రామాలకు ...కాలు సద్వినియోగం చేసుకోవాలని, పార్టీలను విడనాలని అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు త్వరలోనే ఏపీఎంసీ నుంచి సన్నాపురం కాలువ వరకు, కొట్టాల రోడ్డు పనులకు కూడా నిధులు మంజూరవు తాయని వాటికి కూడా భూమి పూజ చేపడతామన్నారు హైకమాండ్ తనకు అవకాశం కల్పిస్తే తాను మంత్రి అయ్యి జిల్లా అభివృద్ధి చేపడతానన్నారు. అలాగే మినీ విధానసభ పనులయ్యేలా చూస్తామన్నారు. తాలుకాకు కావాల్సిన కోర్టు, ఈవో ఆఫీసు, అగ్నిమాపక దళం కార్యాలయం, బస్సుడిపో తదితర వాటిని ఏర్పాటు చేసేందుకు సీఎంతో చర్చిస్తామన్నారు. కళాశాలలో బీఎస్సీ కోర్సులు ప్రారంభమయ్యేందుకు సహకరిస్తామన్నారు. విద్యార్థులకు అనుగుణంగా బస్సుల సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాయమ్మ, నాయకర వెంకోబ, కోరి చిన్న బసవ, పంపాపతి, రామయ్య, దొడ్డ బసప్ప, షణ్ముఖ, పీడీవో సావిత్రి గౌరోజీ, గిరి, బసవ, తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

బగురు హుకుం సమితి అధ్యక్షులుగా తిమ్మనగౌడ బాధ్యతల స్వీకరణ



సిద్ధమ్మనహళ్లి తిమ్మనగౌడను సన్మానిస్తున్న నాయకులు

బళ్లారిరూరల్, జూన్ 20 : బగురు హుకుం సమితి అధ్యక్షుడిగా తిమ్మనగౌడ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున వాయిదాపడిన కార్యక్రమం కోడ్ ముగియడంతో గురువారం జరిగింది. మాజీ మంత్రి నాగేంద్ర, సిటీ ఎమ్మెల్యే భరత్ రెడ్డి, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు ఆయనకు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ ప్రసాద్, గోనాళ్ నాగభూషణ్ గౌడ, మేటి దివాకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

యోగాడేను విజయవంతం చేద్దాం

కంప్లి, జూన్ 20 : అంతర్రాష్ట్రీయ యోగాడేను విజయవంతం చేద్దామని కంప్లి యోగా, పతంజలి సమితి సంచాలకులు మౌనేష్ కోరారు. గురువారం కంప్లిలో మారెమ్మ ఆలయం వద్ద జాగృతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి ఆరోగ్యం కన్నా గొప్పది ఏదీ లేదని, ప్రతి ఒక్కరు యోగా పై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగా పతంజలి సమితి ఆధ్వర్యంలో శుక్రవారం యోగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జంబునాథ, బళ్లారి బసప్ప, కొట్రేష్, నాగప్ప, విరుపాక్షి, మమత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా సమస్యల పరిష్కారం



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

సిరుగుప్ప, జూన్ 20 :వారంలోపు సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ ఆధ్వర్యంలో జనస్పందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తాలుకా వ్యాప్తంగా నెలకొన్న సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందలేదని జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. జాతీయ రహదారి పనులు టెక్కల కోట నుంచి దడే సూగూరు వరకు మందకొడిగా సాగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో బళ్లారి రోడ్డు మార్గంలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయని వాపోయారు. సాగు, తాగునీటి సమస్యలపై కూడా ఆయనకు పలువురు ఫిర్యాదు చేశారు. చివరగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీసీఈవో సుంకనూరు శరణప్ప, తహసీల్దార్ విశ్వనాథ్, తాలుకా పంచాయతీ ఈవో శ్రావణ్ కుమార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, తాలుకా ప్రజలు పాల్గొన్నారు.

ఊరించి.. ఉసూరుమనిపించింది

- తుంగభద్రకు వరద తగ్గుముఖం
- మూడు అంకెలకు పడిపోయిన ఇన్‌ఫ్లో...
- గత ఏడాదికంటే 4 టీఎంసీలు తక్కువగా జలాశయంలో నీటి నిలువ



డ్యాంకు నీరు చేరక పోవడంతో బ్యాక్‌వాటర్‌లో కనిపిస్తున్న ఇసుకతిన్నెలు

బళ్లారి గాంధీనగర్, జూన్ 20: గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది అధికంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపిన నేపథ్యంలో మే ఆఖరి, జూన్ మొదటి వారంలో కర్ణాటక రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా పడ్డాయి. కాని తుంగభద్ర జలాశయానికి మాత్రం ఆశించిన స్థాయిలో ఇప్పటి వరకు వరద నీరు చేరలేదు. తుంగభద్ర జలాశయం పైభాగంలోని తుంగ-భద్ర నదులపై నిర్మించిన జలాశయాలు కూడా ఇంతవరకు పూర్తి స్థాయిలో నిండలేదు. దీంతో కర్నాటక ఆంధ్ర రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న తుంగభద్రకు కూడా ఇంతవరకు ఆశించిన మేర నీరు చేరక పోవడంతో ఆయకట్టు రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. సాధారణంగా జలాశయంలోకి వచ్చే నీటి వివరాలను 24గంటలకొక మారు అధికారులు నమోదు చేస్తుంటారు. గురువారం ఉదయం నమోదు చేసిన వివరాల మేరకు కేవలం 759 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి వస్తుండగా, జలాశయంలో కేవలం 5.079 టీఎంసీల నీరు మాత్రమే నిలువ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి ఇన్‌ఫ్లో జీరో స్థాయికి పడిపోయినా 4.35 టీఎంసీల నీరు నిలువ ఉండేది. జలాశయంలో నీటి చేరిక లేని కారణంగా జలాశయం బ్యాక్ వాటర్‌లో ఇంకా ఇసుక తిన్నెలు అలాగే కనిపిస్తున్నాయి. ముంపునకు గురైన గ్రామాల మైలురాళ్ళు కూడా కనిపిస్తుండడం విశేషం. జలాశయం నిర్మించి ఏడు దశాబ్దాలు జరిగినా జలాశయంలో గ్రామాల సరిహద్దులు తెలిపే మైలురాళ్ళు అలాగే ఉండడం గమనార్హం.

మైలార్ డెవలప్‌మెంట్ అథారిటీ హుళక్కేనా?

బళ్లారి సిటీ, జూన్ 20: విజయనగరం జిల్లా హూవినహడలి మైలార లింగేశ్వరాయానికి ప్రత్యేక డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు అనుమానాస్పదంగా తయారైంది. 1917-18 బడ్జెట్‌లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య మైలార లింగేశ్వర్, దేవరగుడ్డ జాయింట్ అథారిటీని ప్రకటించి రూ.5కోట్లు కేటాయించారు. అధికార యంత్రాంగం నిబంధనలను రూపొందిస్తున్న సమయంలో మైలార క్షేత్రం దేవరగుడ్డ ఆలయ ట్రస్టు అధ్యక్షులు దీనిపై అభ్యంతరం తెలుపుతూ కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ముజరాయి శాఖ ఏడేళ్ళుగా న్యాయపోరాటం చేస్తున్నా పరిష్కారం కాలేదని అర్చకులు అంటున్నారు. మైలార్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటైయితే ఈ క్షేత్ర చిత్రపటమే మారిపోతుంది. ముఖ్యమంత్రి అధ్యక్షతన అథారిటీకి ప్రతి సంవత్సరం గ్రాంట్ విడుదల అవుతుంది. లావాదేవీలన్ని పారదర్శకంగా నిర్వహించడం వల్ల భక్తులకు మరిన్ని సౌకర్యాలు ఏర్పడతాయి. దక్షిణ కర్ణాటక ఆలయాల తరహాలో మైలారాన్ని కూడా అభివృద్ధి చేసి ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు అధికార యంత్రాంగం ముందుకురావాలనేది భక్తుల ఆశ. మైలార ప్రక్కనే కురువత్తి క్షేత్రం ఉంది. రెండు ప్రాంతాల్లోనూ మౌలిక వసతుల కొరత ఉంది. దీనిపై ఎమ్మెల్యే కృష్ణనాయక్ స్పందిస్తూ మైలార దేవరగుడ్డ అంతర్‌జిల్లా పుణ్యక్షేత్రాలు కాబట్టి మైలార కురువత్తి డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశారు.



మైలారలింగేశ్వరాలయం

హోసూరు జోన్

కర్మాగారాల్లో మిథనాల్ వినియోగంపై పోలీసు తనిఖీలు



కర్మాగారాల్లో మిథనాల్ ఉపయోగంపై తనిఖీ చేస్తున్న పోలీసులు

హోసూరు, జూన్ 20 : మద్యం సేవించి కళ్లకురుచ్చిలో పలువురు మృతి చెందిన నేపథ్యంలో హోసూరుతో పాటు జిల్లాలోని మిథనాల్, ఇథనాల్ కర్మాగారాలపై పోలీసులు విచారణ చేపట్టారు. ఎస్పీ తంగదురై ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 15 కర్మాగారాలను పోలీసులు తనిఖీ చేశారు. అలాగే హోసూరు డీఎస్పీ బాబు ప్రశాంత్ నేతృత్వంలో మత్తిగిరి. సిప్‌కాట్, బెంగళూరు, శూలగిరి ప్రాంతాల్లో కూడా కర్మాగారాలను పోలీసులు తనిఖీ చేశారు. పరిశ్రమల్లో ఇథనాల్, మిథనాల్ ఎలా వాడతారు? ల్యాబ్‌ల్లో ఉపయోగించినప్పుడు, అక్కడ కార్మికులు వాటిని బయటకు తీశారా? లేదా? వాటిల్లో ఉపయోగించిన మొత్తం ఎంత తదితర విషయాలపై విచారించారు.

పాఠశాలల ముందు సిగరెట్ ప్రకటనలు వద్దు

హోసూరు, జూన్ 20 : హోసూరు పాఠశాలలు, కళాశాలలు ముందు సిగరెట్ ప్రకటనలను నిషేధించాలని పశుమైతాయగం పార్టీ తరపున ఫిర్యాదు చేశారు. హోసూరులో ప్రభుత్వ స్థలాల్లో గోడలపై సిగరెట్ స్టిక్కర్లను అతికించరాదని, దీనివలన విద్యార్థులపై చెడు ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. సిగరెట్‌ల గురించి ప్రచారం చేస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని (పశుమైతాయగం) ఆర్గనైజర్ రాష్ట్ర ఉపకార్యదర్శి మునిశేఖర్ డిమాండ్ చేశారు. పిల్లలను ప్రలోభపెట్టేందుకు దుకాణాలు, బహిరంగ ప్రదేశాల గోడలపై సిగరెట్ ప్రకటనలు ఉంచుతారని, దీనిని నిషేధించాలని డిమాండ్ చేశారు. వారితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశం, జిల్లా మాజీ కార్యదర్శి అరుణ్‌రాజన్, నగర కార్యదర్శి శక్తికుమార్, మురుగన్, విశ్వనాథన్, వెట్రిప్రబు, గణేశన్ తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో బస్సులు నడిపితే చర్యలు

హోసూరు జూన్ 20: ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ నంబర్లు ఉన్న ఓమ్నీ బస్సులు తమిళనాడులో నడిపితే సీజ్ చేస్తామని రవాణా శాఖా కమీషనర్ షణ్ముగసుందరం హెచ్చరించారు. రాష్ట్రానికి వెలుపల రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ (ఏఐటీపి) ఓమ్నీబస్సులను తమిళనాడులో నడపడం వలన ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోతుందన్నారు. అందుకే రాష్ట్రానికి వెలుపల రిజిస్ట్రేషన్ ఉన్న ఓమ్నీబస్సులను తమిళనాడు రిజిస్ట్రేషన్‌గా మార్చాలని రవాణా శాఖ ఆదేశించింది. ఇందుకు సంబంధించిన గడువు మంగళవారంతో ముగిసింది. దీంతో బయటి రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో నడిచే బస్సులను జప్తు చేస్తామని రవాణా శాఖ కమీషనర్ షణ్ముగసుందరం ప్రకటించారు. ఈ క్రమంలో గురువారం ఉదయం హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ జూజువాడీ చెక్‌పోస్ట్ వద్ద హోసూరు జిల్లా రవాణా అధికారి దురైస్వామి కర్ణాటక నుంచి హోసూరు మీదుగా వచ్చిన ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ నంబర్ గల నాలుగు బస్సులను సీజ్ చేశారు. అందులో నాగలాండ్ రిజిస్ట్రేషన్ నంబర్ గలవి 3 కాగా, మరొకటి పాండిచ్చేరి రిజిస్రేషన్ నంబర్‌తో వుంది. వాటిని హోసూరు రవాణా కార్యాలయానికి తీసుకొచ్చి నిలిపారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

హోసూరు, జూన్ 20: హోసూరు కోర్టు ఆవరణలో గురువారం న్యాయవాదులు తమ సంఘం తరపున వివిధ డిమాండ్లతో ప్రదర్శన నిర్వహించారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, తమిళనాడు ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టం అమలును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ప్రదర్శనకు సంఘం అధ్యక్షుడు ఆనంద్ కుమార్, కార్యదర్శి తిమ్మరాయప్ప నాయకత్వం వహించారు. కార్యదర్శి తిమ్మరాయప్ప అందరికీ స్వాగతం పలికారు.



న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఏడీసీ



నగరంలో పరీక్షా కేంద్రాలను సందర్శిస్తున్న ఏడీసీ దుర్గేష్

రాయచూరు, జూన్ 20 : నగరంలోని సెంట్‌మేరిస్ పాఠశాల కేంద్రంలో జరుగుతున్న ఎస్ఎస్ఎల్‌సీ(టెన్త్) సప్లిమెంటరీ పరీక్షను గురువారం అదనపు జిల్లాధికారి డాక్టర్ కేఆర్ దుర్గేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రంలో చేసిన ఏర్పాట్లు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు పరీక్షలు జరుగుతున్న తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా గురువారం జరిగిన విజ్ఞాన సబ్జెక్ట్‌కు సంబంధించి పరీక్షకు జిల్లాలో మొత్తం 9188 మంది విద్యార్థులు హాజరుకాగా 1388 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో కుప్పకూలి వ్యక్తి మృతి

రాయచూరు, జూన్ 20 : పొలం తగాదాకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వ్యక్తి ఒకరు స్టేషన్‌లో ఒక్కసారిగా కుప్పకూలి మృత్యువాతపడిన సంఘటన గురువారం తాలూకాలోని యాపలదిన్ని పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాజు, జంగ్లప్ప ఇద్దరు అన్నదమ్ములు కాగా తమ పొలంలో వేసుకున్న బోరుబావి నీటి వినియోగానికి సంబంధించి ఇద్దరి మధ్య తగాదా తలెత్తింది. ఈ విషయంలో అన్న రాజు(40)పై అతని తమ్ముడు జంగ్లప్ప అతని భార్య దాడి చేయగా వారిపై ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లిన రాజు, అధికారులతో మాట్లాడుతుండగానే కుప్పకూలి పడిపోయాడు. వెంటనే పోలీసులు ఆయనను ఆస్పత్రికి తరలించి చికిత్సనందించే ప్రయత్నం చేయగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు యాపలదిన్ని పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపారు.



మృతి చెందిన రాజు(ఫైల్)

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

అంతర్జాతీయ యోగా దినోత్సవం



అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న ఆచరిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవతో ఐక్యరాజ్యసమితిలో ప్రతిపాదించగా ఆమోదించబడింది. 2014 సంవత్సరం నుంచి ఏటా యోగా దినోత్సవాన్ని ఆచరిస్తున్నారు. పతంజలి మహర్షి యోగశాస్త్ర సూత్రాలను మానవాళికి అందించిన గొప్ప యోగి. మనస్సు, స్పృహ, చైతన్యం మొదలైనవాటి గురించిన సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు. క్రీస్తుపూర్వం 200 సంవత్సరాలక్రితం ఆయన జన్మించినట్టు ఒక అంచనాగా ఉండగా చారిత్రక పరిశోధనల ప్రకారం క్రీస్తుపూర్వం 5వేల సంవత్సరాలుగా ఉండవచ్చుననే మరో వాదన ఉంది.

జీన్‌పాల్ సర్త్రె (జయంతి)



ఫ్రెంచ్ దేశానికి చెందిన ప్రముఖ తత్వవేత్త జీన్‌పాల్ చార్లెస్ ఐమర్డ్ సర్త్రె 1905 జూన్ 21న జన్మించారు. రచయిత. కథలు, నవలలు రాయడంతోపాటు సాహితీ విమర్శకులుగా, రాజకీయనేతగాను రాణించారు. ఎబీయింగ్ అండ్ నథింగ్‌నెస్, నాసియా వంటి రచనలు ఎంతో పేరొందాయి. నోబెల్ పురస్కారం ప్రకటించగా సున్నితంగా తిరస్కరించారు. అయినా నోబెల్ సాహిత్య పురస్కార విజేతల జాబితాలో ఆయన పేరు నమోదు చేశారు. రెండో ప్రపంచయుద్ధంలో ఫ్రెంచ్ సైన్యంలో వాతావరణశాఖ శాస్త్రజ్ఞుడిగా వ్యవహరించారు. 1980 ఏప్రిల్ 15న కన్నుమూశారు.

ప్రిన్స్ విలియమ్ (పుట్టినరోజు)



విలియమ్ ఆర్థర్ ఫిలిప్ 1982 జూన్ 21న జన్మించారు. బ్రిటీష్ రాజసంస్థానం వేల్స్‌కు చెందిన కింగ్ చార్లెస్ 3, డయానాల పెద్ద కుమారుడు. క్వీన్ ఎలిజబెత్ 2కు మనుమడు. డ్యూక్ ఆఫ్ కేంబ్రిడ్జ్‌గా వ్యవహరిస్తున్నారు. బ్రిటీష్ మోనార్చ్ తరపున అన్ని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాయల్ మిలిటరీ అకాడమీలో తర్ఫీదు పొందారు. ది రాయల్ ఫౌండేషన్ చేపట్టే చారిటీ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. పర్యావరణం, వైద్యం, అత్యవసర విభాగాలతోపాటు వన్యప్రాణుల సంరక్షణ వంటి వాటికి ప్రాధాన్యం ఇస్తున్నారు. పలు గౌరవహోదాలలో కొనసాగుతున్నారు.

ఉద్యోగులు లేక 'పట్టు' సడలుతోంది..!

● నిర్వీర్యమవుతున్న పట్టు పరిశ్రమ ● రైతులకు సమాచారం ఇచ్చే వారే లేరు.. ● విలీనంపై సర్వత్రా వ్యతిరేకత

బెంగళూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆహార ఉత్పత్తులతోపాటు ఆదాయం పెంచుకునే ప్రత్యామ్నాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉద్యాన పంటలసాగు, పాడి పరిశ్రమలపట్ల మొగ్గు చూపుతున్నారు. వీటితోపాటు పట్టు పురుగుల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. ఇతర పంటల సాగుతో పోలిస్తే పట్టు పురుగుల పెంపకానికి వాతావరణం అనుకూలంగా ఉండాలి. దేశవ్యాప్తంగా పట్టు సాగుకు రాష్ట్రంలోని బెంగళూరు, మైసూరు, కోలారు, చిక్కబళ్లాపుర, రామనగర తదితర జిల్లాలు అనుకూలంగా ఉన్నాయి. పట్టు పరిశ్రమ రాష్ట్రంలో నాలుగు దశాబ్దాలకు పైగా సాగు అవుతోంది. పట్టు పరిశ్రమలో మల్బరీ సాగు చేయడం, పట్టు పురుగులకు మేతగా వేసి నెలరోజులు పెంచడం ద్వారా పట్టుగూళ్లు తయారవుతాయి. వాటిని మార్కెట్‌లో విక్రయించి ఆదాయం పొందుతుంటారు. ఇలా రైతులు పట్టుద్వారా ఆదాయం పొందాలంటే మల్బరీ ఆకు సాగుతోపాటు పురుగుల పెంపకం, వాటి పర్యవేక్షణ కీలకమైనది, రాష్ట్రంలో పట్టు పరిశ్రమకు అనుకూలంగా ఉండడంతో ప్రభుత్వం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసింది. దక్షిణాది రాష్ట్రాలు పట్టుసాగుకు అనుకూలంగా ఉండడంతో బెంగళూరు కేంద్రంగా కేంద్రపట్టు మండలి (సెంట్రల్ సిల్క్‌బోర్డు) ఉంది. పట్టు నాణ్యతతోపాటు పట్టు పరిశ్రమపై ప్రత్యేక పరిశోధనలు చేస్తోంది. రాష్ట్రానికి సంబంధించి పట్టు పరిశ్రమ శాఖలో దశాబ్దాలుగా నియామకాలు లేకపోవడంతో పనిచేసే ఉద్యోగులపై పెనుభారం పడుతోంది. రాష్ట్రంలో 4,299 పోస్టులు పట్టు పరిశ్రమశాఖకు మంజూరు కాగా భర్తీ చేసింది మాత్రం కేవలం 1300



బెంగళూరులోని పట్టు పరిశోధనా కేంద్రం

మాత్రమే. 2022 సమాచారం ప్రకారం 1.10లక్షల హెక్టార్లలోసాగు చేస్తున్నారు. 1.46 లక్షల మంది పట్టు పరిశ్రమపై ఆధారపడ్డారు. ఏటా పట్టు సాగు విస్తీర్ణం పెంచేదిశగా ఉద్యోగులు పనిచేయాల్సి ఉంది. అయితే ఉద్యోగుల సంఖ్య తగ్గుతుండడంతో అదనపు భారం అవుతోంది. ఇలా పట్టు పరిశ్రమ కార్యాలయాలు, తాలూకా కార్యాలయాలు, సాంకేతిక సిబ్బంది, టెక్నికల్ సర్వీస్‌సెంటర్ వంటి అన్ని విభాగాల్లోనూ పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఏటా రిటైరయ్యేవారి సంఖ్య కొనసాగుతున్నా నియామక ప్రక్రియ జరగడం లేదు. పట్టు పరిశ్రమశాఖ లక్ష్యం నెరవేర్చడంతోపాటు సమస్యల పరిష్కారానికి సలహాలు ఇవ్వడం కూడా కష్టమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఉద్యోగుల కొరత వేధిస్తోంది. రేరింగ్‌షెడ్‌లు, మల్బరీ పంటకు రోగాలు, పురుగుల పెంపకంలో వచ్చే సమస్యలు, రోగాలకు సిబ్బంది రైతుల చెంతకు వెళ్లి సలహా సూచనలు ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని జిల్లాల్లో 50శాతంకంటే ఎక్కువసిబ్బంది కొరత ఉండడంతో అన్ని తానై అనేలా పనిచేయాల్సి వస్తోంది. కాగా కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ కేపీఎస్‌సీ ద్వారా 75మందిని నియమించుకునేందుకు ప్రక్రియ సాగుతున్నట్టు రాష్ట్ర పట్టు పరిశ్రమశాఖ కమిషనర్ రాజేశ్‌గౌడ తెలిపారు. పట్టు పరిశ్రమలో ఉండే ఖాళీపోస్టులను అంచెలంచెలుగా భర్తీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పోస్టులు తగ్గించడం లేదా ఇతర విభాగాల్లో విలీనం చేయాలనే ఆలోచన వీడాలని పట్టు రైతుల హితరక్షణా వేదిక ముఖ్యులు మాలూరు శివణ్ణ డిమాండ్ చేశారు. పట్టు పరిశ్రమశాఖతోపాటు ఉద్యానవనశాఖను వ్యవసాయశాఖలో విలీనం చేయాలనే ప్రస్తావనపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. మూడుశాఖల్లోనూ ఉద్యోగుల కొరత దశాబ్దకాలంగా వెంటాడుతోంది. శాఖల విలీనం జరిగితే పని ఎక్కువగా ఉండే వ్యవసాయశాఖకు మేలు జరుగుతుంది. ఇప్పటికే ఉద్యోగుల కొరతతో సజావుగా సాగని పట్టుశాఖ మరింత ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందని పట్టు రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

బాలుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

చింతామణి, జూన్ 20: తాలూకాలోని మురగమల్లా హోబళి నిమ్మకాయలహళ్ళి గ్రామంలో బుధవారం సాయంత్రం చిన్నాన్న అయిన రంజిత్‌కుమార్ తన అన్న కుమారుడిని హతమార్చిన కేసులో పోలీసులు కేవలం గంటల అవధిలో అరెస్టు చేశారు. బుధవారం మూడేళ్ల చిన్నారిని హతమార్చిన సంగతి తెలిసిందే. బట్లహళ్ళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గురువారం తెల్లవారుజామున నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరు పరిచారు. విచారణలో వదిన తనను మందలించడంతోనే మనస్తాపానికి గురై పిల్లవాడిని హతమార్చినట్లు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. చిక్కబళ్ళాపుర ఎస్పీ డీఎల్ నాగేశ్ మాట్లాడుతూ నిందితుడు రంజిత్, బాలుడి తండ్రి మంజునాథ్ సోదరుడని ఇద్దరిమధ్యా ఎలాంటి పాతకక్షలు లేవన్నారు. మరింత దర్యాప్తు చేపడ్తామన్నారు.

మానసిక వైకల్యం జీవనశైలిపై ప్రభావం

దొడ్డబళ్ళాపుర, జూన్ 20: మానసిక వైకల్యం జీవనశైలిపై ప్రభావం చూపుతుందని నవోదయ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు నవోదయ చేతన్ అభిప్రాయపడ్డారు. నవోదయ చారిటబుల్ ట్రస్టు, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం, బెంగళూరు గ్రామీణ జిల్లా, సురానా కళాశాల బెంగళూరు సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ సముదాయంలో మానసిక ఆరోగ్యంపై జాగృతి జాతా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతను వివరించారు. గత వారం మళేకోట పంచాయతీ పరిధిలో వీధి నాటకాల ద్వారా జాగృతి కల్పించారు. శారీరక ధృడత్వంతోపాటు మానసిక ధైర్యం కూడా ప్రధానమని వివరించారు.

జేపీ నగర్‌లో ఫ్యాషన్‌బ్రాండ్ ప్రారంభం

బెంగళూరు, జూన్ 20(ఆంధ్రజ్యోతి): జేపీనగర్‌లో ప్రత్యేకమైన ఫ్యాషన్‌బ్రాండ్ బిగ్‌హాలోను లాంఛనంగా ప్రారంభించారు. నగరంలో ఇది ఆరో స్టోర్‌గా ఉన్నట్టు బ్రాండ్‌హెడ్ మోదిత త్రిపాఠి తెలిపారు. దక్షిణాదిన అన్నివర్గాలకు ఉత్తమమైన, లేటెస్ట్ బ్రాండ్‌లు అందించడం లక్ష్యమన్నారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడలలో 15 స్టోర్‌లు ఉన్నాయన్నారు. బెంగళూరులో అన్నివర్గాలకు ఫ్యాషన్స్ అందించడం ఆశయమన్నారు. మరో నెలరోజుల్లో దేశమంతటా 50స్టోర్‌లను తెరిచే లక్ష్యంగా ఉన్నట్టు తెలిపారు.

నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కళాశాల

బెంగళూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): 107 ఏళ్ల చరిత్ర కల్గిన నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభిస్తున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ హెచ్ఎన్ సుబ్రమణ్య తెలిపారు. జయనగర్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 1917లో నేషనల్ కళాశాల ప్రారంభమైందన్నారు. ఆరంభంలో హైస్కూల్, తర్వాత ప్రాథమిక, అనంతరం పీయూ, డిగ్రీ తోపాటు 21కళాశాలలు కొనసాగుతున్నాయన్నారు. బసవనగుడి నేషనల్ కళాశాల తొలి సంస్థ అయినా వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేశామన్నారు. సొసైటీ గౌరవ కార్యదర్శి వెంకటశివారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఇంజనీరింగ్ కళాశాలను విద్యార్థులకు అనుకూలం కోసం ప్రారంభించనున్నట్టు తెలిపారు. జయనగర్ కళాశాల చైర్మన్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఏఐసిటిఇ అనుమతులు పొందామని కంప్యూటర్‌సైన్స్, ఏఐ, ఇసి, ఎంబిఎ, ఎంసిఎ కోర్సులు ప్రారంభిస్తామన్నారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న కళాశాల నిర్వాహకులు

వైసీపీ నాయకుడి దౌర్జన్యం

తాగునీటి బోరు మరమ్మతులను అడ్డుకున్న వైనం

తప్పుబట్టిన టీడీపీ నాయకులు

పనులు చేయాల్సిందేనని పట్టుబట్టడంతో పూర్తి చేసిన సిబ్బంది



25వ వార్డులో తాగునీటి బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



మరమ్మతులు చేస్తున్న సిబ్బందిని వెనక్కి పంపుతున్న వైసీపీ నాయకుడు

కదిరి, జూన్ 20: వైసీపీ అధికారం కోల్పోయినా ఆ పార్టీ నాయకులు మాత్రం దౌర్జన్యాలు ఆపట్లేదు. ప్రజలకు ఉపయోగకరమైన తాగునీటి బోరుకు మరమ్మతులు చేస్తుంటే అడ్డుకున్నాడు ఓ వైసీపీ నాయకుడు. సిబ్బందిని అక్కడి నుంచి పంపించేశాడు కూడా. మరమ్మతులు చేయాల్సిందేనని టీడీపీ నాయకులు పట్టుబట్టడంతో అధికారులు దిగొచ్చారు. ఎట్టకేలకు మరమ్మతులు పూర్తి చేశారు. వైసీపీ నాయకుడి తీరుపై జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. కదిరిలోని 25వ వార్డు నుంచి గెలుపొందిన నజీము న్నీషా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమె వార్డులోనే ఓ తాగునీటి బోరు మూడేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. విషయం తెలుసుకున్న టీడీపీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, మాజీ కౌన్సిలర్ ఖాదర్‌బాషా బోరు వద్ద కెళ్లి, మరమ్మత్తులు చేయాలని మున్సిపల్ సిబ్బందికి చెప్పారు. ఆ మేరకు గురువారం వారు మరమ్మతులు చేస్తుండగా వైసీపీ నాయకుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త సాదిక్ బాషా అడ్డుకున్నారు. తమ వార్డులో టీడీపీ నాయకులు పనులు చేయించడం ఏంటంటూ బోరు మరమ్మతులను అడ్డుకున్నారు. పనులు చేస్తున్న కార్మికులను అక్కడి నుంచి పంపించేశారు. విషయం మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ వద్దకెళ్లింది. టీడీపీ నాయకులు.. కమిషనర్‌ను కలిసి, బోరు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కమిషనర్ వెంటనే సిబ్బందిని పంపి బోరు మరమ్మతులు చేయించారు. ప్రజలకు ఉపయోగకరమైన తాగునీటి బోరు మరమ్మతులు చేస్తుంటే అడ్డుకోవడం ఏంటన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ వార్డులోనే తాగునీటి బోరుకు మూడేళ్లుగా మరమ్మతులు చేయించకపోవడం వైసీపీ పాలన తీరుకు నిదర్శనమని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు.

ఛీ.. ఛీ..!

» కుళ్లిన కళేబరాలు » కంపుకొడుతున్న నీరు
» పట్టించుకోని యంత్రాంగం
» గ్రామస్థుల ఫిర్యాదుతో ట్యాంకు శుభ్రం

మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యానికి పరాకాష్ట

తాగునీటి ట్యాంకులో పడి కోతుల మృతి

పుట్టపర్తి, జూన్ 20: మున్సిపల్ యంత్రాంగం మొద్దునిద్రకు నిదర్శనం ఈ ఘటన. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాల్సిన బాధ్యతను గాలికొదిలేశారు. వైసీపీ పాలనలో ట్యాంకులను శుభ్రం చేయాలన్న ఆలోచనే మరిచారు. వాటిలో దుమ్ము, ధూళి కూడా పడకుండా చూసుకోవాల్సిన మున్సిపల్ యంత్రాంగం మొద్దునిద్రలో ఉంది. అది ఎంతలా అంటే.. ఎప్పుడో కోతులు ట్యాంకులో పడి, అవి చనిపోయి, వాటి కళేబరాలు కుళ్లి కంపు కొడుతున్నా.. పట్టించుకునే పరిస్థితిలో లేరంటే వారి నిర్లక్ష్యం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. నీరు దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులే గుర్తించి, అధికారుల దృష్టికి తీసుకెళ్తే అప్పుడు వారు వచ్చి ట్యాంకును శుభ్రం చేయించారు మరి. పట్టణ పరిధిలోని పెద్దకమ్మవారిపల్లిలో ఈ ఘటన వెలుగుచూసింది. స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో సత్యసాయి తాగునీటి ప్రాజెక్టు కింద ట్యాంకు నిర్మించారు. దాని ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ట్యాంకు పైన ఉన్న మూత ఇటీవల తొలగిపోయింది. వెంటనే మూత ఏర్పాటు చేయాలని స్థానికులు.. మున్సిపల్ అధికారులను కోరినా పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో నీటి కోసం వెళ్లిన కోతులు అందులో పడి మృతి చెందాయి. కళేబరాలు కుళ్లిపోయాయి. నాలుగురోజులుగా ట్యాంకు నుంచి వచ్చే నీరు దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులకు అనుమానం వచ్చింది. ట్యాంకు వద్దకు వెళ్లి, పరిశీలించి నీటిని వదిలేశారు. ట్యాంకు లోపల చూడగా.. కుళ్లిపోయిన కోతుల కళేబరాలు కనిపించాయి. వెంటనే వారు.. మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది ట్యాంకును శుభ్రం చేశారు. కలుషితమైన ఆ నీటిని తాగి ఉండుంటే తమ పరిస్థితి ఏమిటని గ్రామస్థులు వాపోతున్నారు.





జోరుగా మిరప విత్తన జీరో వ్యాపారం

● అనధికారికంగా వెలసిన షాపులు ● పట్టించుకోని అధికారులు

విడపనకల్లు, జూన్ 20: మండల కేంద్రంలో మిరప విత్తన జీరో వ్యాపారం జోరుగుసాగుతోంది. అనధికారికంగా మిరప విత్తన విక్రయ కేంద్రాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఏదైనా విత్తనాన్ని విక్రయించాలి అంటే ముందుగా ప్రభుత్వం అనుమతులు పొందాలి. విక్రయ లైసెన్స్ కలిగి ఉండాలి. అయితే విడపనకల్లు మండలంలో వైసీపీ నాయకులు బరితెగించి ఎటువంటి అనుమతులు లేకుండా మిరప విత్తన విక్రయ షాపులను ప్రారంభిస్తున్నారు. ఇక్కడ మిరప విత్తన కొనుగోలు చేసేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్నూలు జిల్లా, కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చి వారికి కావాల్సిన విత్తనాన్ని రైతులు తీసుకెళ్తుంటారు. ఒక్కొక్క వ్యాపారి రోజుకు వంద క్వింటాళ్లకుపైగా వ్యాపారం చేస్తుంటాడు. అంటే ఈ లెక్కన ప్రభుత్వ ఆదాయానికి రోజుకు ఎంత గండిపడుతోందో ఇట్టే అర్థమైపోతోంది. డబ్బి రకం క్వింటాలు రూ. 34వేల నుంచి 38వేలు, కడ్డీ రకం క్వింటం రూ.18వేల నుంచి 20 వేలకు విక్రయిస్తున్నారు. మండల కేంద్రంలో రోజూ వివిధ ప్రాంతాల రైతులు కొనుగోలుకు వస్తుండటంతో సందడి వాతావరణం నెలకొంటోంది. విత్తనాలు విక్రయిస్తే అధికారులు దాడులు చేస్తారని ఆలోచించి తెలివిగా వ్యాపారులు మిరపకాయలను రైతులకు కేజీల ప్రకారం విక్రయిస్తున్నారు. అక్కడ వాళ్లు ఏర్పాటు చేసుకున్న మిషన్లలో మిరపకాయలను ఆడించి విత్తనాన్ని విక్రయిస్తున్నారు. మిరపకాయలు ఆడించే మిషన్లకు కూడా ఎటువంటి అనుమతులు లేకుండా స్థానిక బస్టాండ్ ప్రాంతంలో బహిరంగంగా ఏర్పాటు చేసి విత్తనాలను అమ్ముతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో దాదాపుగా మిరప విక్రయ షాపులు వందకు పైగా వెలిశాయి. రోజూ కోట్లలో వ్యాపారం చేస్తూ ప్రభుత్వానికి ఎటువంటి ట్యాక్స్‌లు చెల్లించకుండా జోరుగా జీరో వ్యాపారం చేస్తున్నా మండలంలో ఏ ఒక్క అధికారి పట్టించుకోవటం లేదు. రైతులు కొనుగోలు చేసే విత్తనానికి ఎటు వంటి రసీదులు ఉండవు. లక్షల్లో పెట్టుబడులు పెట్టి విత్తనాన్ని కొనుగోలు చేసిన రైతులకు ఆ విత్తనం ఫెయిలూర్ అయితే ఇక అంతే ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఈ నేపథ్యంలో అనధికారికంగా వెలసిన మిరపకాయ విత్తన కేంద్రాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మా పరిధిలోకి రాదు

అనుమతులు లేని మిరపకాయలు విక్రయించే షాపులు ఉన్న విషయం తెలిసింది. అయితే వ్యాపారులు తెలివిగా విత్తనాన్ని విక్రయించకుండా ఎండు మిరపకాయలు విక్రయిస్తున్నారు. వ్యాపారులే వారి మిషన్లకు మిరపకాయలు ఆడించి విత్తనాన్ని రైతులకు ఇచ్చి పంపుతున్నారు. రైతులు కొనుగోళ్లు చేస్తున్నా విత్తనానికి ఎటువంటి రసీదులు ఉండటంలేదు. ఏదైనా జరిగితే రైతులు ఎవర్ని అడగాలో తెలియని పరిస్థితి ఉంది. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో మిరప విత్తనకాయలు విక్రయించే వ్యాపారులు ప్రభుత్వ అనుమతులు లేకుండా విక్రయిస్తున్నారు. ట్యాక్స్ ఎగొట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఈ జీరో వ్యాపారం మా పరిధిలోకి రాదు. విత్తనాలు నేరుగా విక్రయిస్తే మేం చర్యలు తీసుకోగలం.

- ఏఓ పెన్నయ్య, విడపనకల్లు



అనుమతులు లేకుండా వెలసిన మిరప విత్తన విక్రయ షాపు

మహిళ గొంతుకోసి బంగారు, నగదు చోరీ

మడకశిర రూరల్/పావగడ, జూన్ 20 : డబ్బు, బంగారు నగల కోసం మహిళ గొంతుకోసి హత్యచేసినట్లు పావగడ పోలీసులు తెలిపారు. ఈ సంఘట న పావగడ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన మాచరాజనహళ్లి అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. పావగడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మడకశిర మండలం ఆంధ్ర ,కర్ణాటక సరిహద్దులో ఉన్న ఎల్లోటి గ్రామానికి చెందిన వడ్డె చంద్రక్క(62) అనే మహిళ తన పొలంలో పనిచేస్తుండగా బుధవారం సాయం త్రం గుర్తుతెలియని దుండగులు ఆ మె వద్ద ఉన్న రూ.25వేలు నగదు, చెవిలో ఉన్న బంగారు కమ్మలు లాక్కున్నారు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఆమె గొంతుకోసి అక్కడి నుంచి పరారీ అయి ఉంటారని తెలిపారు. అటుగా వె ళ్లిన వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసు కున్న అడిషనల్ ఎస్పీ మరియప్ప, సీఐలు సురేష్, గిరీష్, సిబ్బంది అక్కడికి చేరు కుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పావగడ పోలీసులు తెలిపారు. త్వరలోనే హంతకులను పట్టుకుంటామన్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



హత్యకు గురైన వడ్డె చంద్రక్క



గుండెమార్పిడి చేయించుకున్న వెంకటేశ్ దంపతులతో ఆస్టర్ వైద్య బృందం

ఐటీ ఉద్యోగికి రెండుసార్లు గుండెమార్పిడి

● విజయవంతంగా నిర్వహించిన బెంగళూరు ఆస్టర్ వైద్యులు

బెంగళూరు, జూన్ 20(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఆస్టర్ ఆసుపత్రి వైద్యులు ఓ ఐటీ ఉద్యోగికి రెండుసార్లు గుండె మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. 2023 డిసెంబరు 31న రెండోసారి గుండె మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న ఐటీ ఉద్యోగి వెంకటేశ్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని వైద్య నిపుణులు నాగమల్లేశ్ ప్రకటించారు. బెంగళూరు నగరంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఐటీ ఉద్యోగిని మీడియాకు పరిచయం చేశారు. వైద్యులు నాగమల్లేశ్, దివాకర్ భట్ మాట్లాడుతూ, '2016లో ఐటీ ఉద్యోగికి డైలేటెడ్ కార్డియో మయోపతి లక్షణాలు కనిపించాయి. పలు ఆసుపత్రులు సందర్శించి, చివరకు ఆస్టర్ ఆసుపత్రికి వచ్చారు. ఆయనకు గుండెమార్పిడి సర్జరీ చేశాం. ఆ తరువాత పూర్తిగా కోలుకుని సాధారణ జీవనం సాగించారు. 2018లో వివాహం చేసుకున్నారు. 2020లో కొవిడ్ సోకి ఇంటెన్సివ్‌కేర్‌లో చికిత్స పొందారు. 2023లో మరోసారి గుండె సమస్య తలెత్తింది. రక్తస్రావంతోపాటు ఇతరత్రా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైద్య పరీక్షల ద్వారా గుండెమార్పిడి తప్పనిసరని నిర్ధారించాం. గత ఏడాది డిసెంబరు చివరి వారంలో ఆయన అడ్మిట్ అయ్యారు. విజయవంతంగా గుండె మార్పిడి శస్త్ర చికిత్సను పూర్తి చేశాం. దేశంలో రెండుసార్లు గుండె మార్పిడి చేయించుకున్న వారిలో వెంకటేశ్ రెండోవారు. కర్ణాటకకు చెందిన వారు తొలి వ్యక్తి' అని వివరించారు. వెంకటేశ్ మీడియాతో మాట్లాడుతూ, 'తొలిసారి గుండె జబ్బును వారం రోజుల్లోనే తెలుసుకున్నా. అప్పుడు గుండె మార్పిడికి నాటి ఏపీ ప్రభుత్వం ద్వారా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.7 లక్షలు సాయం చేశారు. రెండోసారి ఆపరేషన్‌కు రూ.10 లక్షలకు దరఖాస్తు చేసుకున్నాం. ఇంకా నిధులు విడుదల కాలేదు. రెండోసారి ఆపరేషన్‌తో కొన్ని ఇబ్బందులు వచ్చాయి. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నా' అని తెలిపారు. సమావేశంలో వైద్యులు గణేశ్ కృష్ణన్, మధుసూదన్ నారాయణ్, ప్రశాంత్, సీఈఓ రమేశ్ కుమార్ పాల్గొన్నారు.